# స్వప్న ప్రభాతం

**"శేషశైలా వాసా శ్రీ వేంకటేశా**

**శయనించు మా అయ్య శ్రీ చిద్విలాసా .... "**

జగన్నాధం బస్సు దిగగానే చలిపులి ఎగబడింది. శ్రీ వేంకటేశ్వర దేవాలయం నుండి ఏకాంతసేవ వినబడుతూంది. మధ్యతరగతి మనిషి మంత్రితో తలపడినట్టు - పున్నమి వెన్నెల వీధి లైట్లతో పోటీ పడ్తూంది.

నిజానికి ఈ పవళింపు సేవలూ, సుప్రభాతాలూ భగవంతుడి కవసరమా ...? అదేమో కానీ భగత్ స్వరూపులైన మానవులు నియమిత సమయాల్లో నిద్ర పోవాలి, నిద్ర లేవాలి అనే సందేశం మాత్రం అందించి తీరతాయి. కాకపోతే సర్వకాల సర్వావస్థల్లోనూ జగన్నాటకాన్ని క్రమం తప్పకుండా నడిపించే సూత్రధారిని మానవమాత్రులు నిద్రపుచ్చటమేమిటీ?

"శ్రీదేవి చెంతకూ చిలిపిగా చూడకూ

అలివేలి మంగకూ అలుక రానీయకూ

ముద్దుసతులిద్దరిని .... "

ఆహా ! అదృష్టమంటే ఆయనదే. ఐనా తన అదృష్టానికేమైందని ! అందమైన భార్య, ఆణిముత్యాల్లాంటి కొడుకూ, కూతురూ. తనను నలభయ్యేళ్ళకే తాతను చేసిన శాంతి తను ఊరెళ్ళే ముందు పండంటి బాబుతో అత్తారింటి కెళ్ళింది. డిగ్రీ సెకండియర్ దాకా ఈదుకొచ్చిన కొడుకు వేణు ఏం చేస్తున్నాడో, వెధవకి సినిమాల మీదున్న పట్టింపు చదువు మీద లేదు.

చాంతాడంత ఉద్యోగ జీవితానికి బెత్తడంత ప్రమోషనిచ్చి - దానికి నెల రోజుల ట్రయినింగన్నారు. ప్రమోషనిష్టమే కానీ ట్రయినింగే కష్టం. ఐనా తప్పుతుందా?

"నాకు ప్రమోషనొచ్చింది భారతీ!"

సంతోషవార్త షడెన్‌గా వినగానే - గుండెల్లోంచి తోసుకొచ్చిన నవ్వును పెదాలకు పరిమితం చేసి చిలిపి చూపులు విసిరింది ఇంటి ఇల్లాలు - శ్రీవారు సాధించిన ఘనకార్యానికి నా జోహార్లు అన్నట్టుగా.

"ముప్పై రోజుల ట్రెనింగ్ కోసం శ్రీకాకుళం వెళ్ళాలి. వెంటనే బ్యాగేజి తయారు చెయ్".

"హమ్మా! ఎక్కడి సిద్దిపేట, ఎక్కడి శ్రీకాకుళం ? ముష్టి ప్రమోషన్‌కు ముప్పై రోజుల ట్రెనింగా .. అది మూడొందల కిలో మీటర్ల అవతలనా?" ముక్కు మీద వేలేసుకోబోయి గుండెలు బాదుకుంది.

"ఈ ముష్టి ప్రమోషన్లే పెన్షన్ జీవితానికి పుష్ఠినిస్తాయోయ్ ! ఐనా ఇంట్లో వేణు వున్నాడు కదా, నీకేం భయం ?"

"భయం కాదండీ, బాధ ! మన పెళ్ళయ్యాక నెల రోజులు మిమ్మల్ని విడిచి నేనెప్పుడైనా వున్నానా? పురిటికి పుట్టింటికెళ్ళినా మీరు వారం వారం వచ్చేవారు గదా ... ఇప్పుడు గూడా ... "

"అయ్యబాబోయ్ ! అలాగైతే అయ్యగారి జీతం ఆర్టీసీకి సమర్పయామి."

"మరెలాగండీ ?" బుంగమూతి ముడేసి గుండెల మీద ఒరిగిపోయింది. భార్యా పరిష్వంగం తియ్యని అనుభవాన్నిచ్చింది.

నెల రోజులు భారతిని విడిచి ఉండాలంటే మాటలా మజాకా ?... ఏదో అశక్తత ఆవహించబోయింది. కాని గుండెదిటవు చేసుకోవటం వినా మరో మార్గం కన్పించలేదు.

"దిగండి సార్, ఇల్లు వచ్చేసింది". ఆటో ఇంటిముందాగింది.

తలుపు తీసి తన్మయంగా చూచింది భారతి. నాలుగు కళ్ళు కలబడ్డాయి. గుండె చప్పుళ్ళు ప్రణయరాగం విన్పిస్తున్నాయి. అనురాగ సముద్రంలో మమతల కెరటాల మీద మనసుల కోలాటం. రెండూ మూగవోయినై.

"వచ్చారా ... రండి !" సూట్‌కేస్ అందుకుంది.

"ఓ ... రెక్కలు కట్టుకు వచ్చేశానోయ్".

వెనక్కు తిరిగిన భారతి జడ జగన్నాథం చేతిలోకొచ్చింది. బోనులోంచి బయటపడిన సింహంలా కొంటెతనం పరుగులు తీసిందతన్లో.

"అబ్బా ఇదేమిటండీ ? " చెక్కిళ్ళు విచ్చుకున్నాయి. నున్నటి చెంపల మీది లైటు వెలుగు మరింత బలం పుంజుకుంది.

"అదో ... అటు చూడండి !" ఎదురు గది వైపు కళ్ళు తిప్పింది నాజూగ్గా.

"అది మన పడగ్గదే కదా !"

"ఎవరూ ! నాన్ననా " అదే గది నుండి కూతురు శాంతి బయటకొచ్చింది. నెత్తిమీద మొట్టికాయ పడినట్లైంది. "అర్థమైందా" అన్నట్టు చూస్తోంది భారతి.

"ఏమ్మా ఎప్పుడొచ్చావ్? అల్లుడుగారొచ్చారా?"

"వారం రోజుల క్రితం నన్నిక్కడ దిగబెట్టి వెళ్ళారు నానా ! పదిహేను రోజులు హైద్రాబాద్‌లో ట్రెనింగటా ..." ఎగాదిగా చూచింది. "అదేమిటి నాన్న అలా చిక్కి పోయారేమిటీ?"

వెధవ ట్రెనింగ్ దయ్యం అల్లుణ్ణి కూడా పట్టేసిందన్నమాట. బోడి ట్రెనింగిప్పుడే రావాలా అతనిక్కూడా!

"శ్రీకాకుళం నీళ్ళు పడలేదా నాన్నా?"

"అదేం లేదమ్మా."

"ముందు భోంచెయ్యి నాన్నా!"

శాంతి కూతురే కాదు తల్లికూడా. తల్లి చనిపోయాక సంవత్సరం లోగా పుట్టింది. అందుకే తల్లి పేరే పెట్టుకున్నాడు. మాటల్లోనే కాదు గుణంలో కూడా తల్లి పోలికే.

జగన్నాధముంటుంది అద్దె ఇంటిలో. తలుపులులేని చిన్న వంటగది, ఓ పడగ్గది, వసారా లాంటి బయట గదిని ప్లైవుడ్ చెక్కల ద్వారా విడదీసి రెండుగా చేశారు. చెక్కల కటుపక్క లైటు వెలుగుతోంది. అటు వెళ్ళింది భారతి నవ్వాపుకుంటూ.

"ఒరేయ్ వేణూ... మీ నాన్నొచ్చాడురా ! లే ..."

మరో ప్రపంచంలోంచి మహా ప్రపంచంలో కొచ్చి కళ్ళు నులుముకున్నాడు వేణు.

"ఇప్పుడేనా నాన్నా రావటం!" ఆవులిస్తూ వచ్చాడు.

"ఔన్రా! బాగా చదువుకుంటున్నావా?"

"చదువుతున్నా నాన్నా ... ఆ... హాయ్ !"

పడగ్గదిలోంచి బాబు ఏడుపు వినిపించింది.

"అదిగో నీ మనవడు పిలుస్తున్నాడు నాన్నా!" అంటూ లోపలికెళ్ళింది శాంతి.

బిస్కట్ పాకెట్ ఇస్తేగాని బడికెళ్ళనని మారాం చేసిన శాంతేనా ఇది! కాళ్ళూ చేతులూ కడుక్కొచ్చి మనవడి నెత్తుకున్నాడు. బోసి నవ్వుల బాబు బోలెడన్ని కబుర్లు చెప్పాడు. జగన్నాటకంలో జగన్నాధం చిన్న పిల్లాడైపోయాడు.

❖ ❖ ❖

రాత్రి పదకొండైంది. శాంతికి తోడు భారతి పడుకుంది గదిలో. చెక్కలకటుపైపు ముసుగుదన్నాడు వేణు. మిగిలిన వసారాలో మడత మంచం జగన్నాధంకు దక్కింది. చేతులున్న పుస్తకం మీద మనసు లగ్నం కాలేదు.

ఒళ్ళంతా ఎలాగోలా వుంది. మనసు దేనికోసమో ఎదిరు చూస్తోంది. అటూ ఇటూ అరవై సార్లు దొర్లినా నిద్రాదేవి కరుణా కటాక్ష వీక్షణం లభించలేదు.

చల్లని చలికాలం. నీ అవస్థకు నేనే ప్రత్యక్షసాక్షినంటూ పైన ఫ్యాన్ తిరుగుతూనే వుంది. శరీరంలో వేడి జనిస్తూనే వుంది. గోడగడియారం పన్నెండు కొట్టి తన ఉనికి తెలుపుకుంది. బుర్రలో ఏదో తళుక్కుమంది. మెల్లిగా వంటింట్లోకెళ్లి గ్లాసు కిందపడేసి పిల్లిలా వచ్చాడు.

"భారతీ! వంటింట్లో ఏదో అలికిడౌతుంది చూడూ!"

"ఆఁ ... ఎలుకలయి వుంటాయి. మీరు పడుకోండి."

"కాదు భారతీ! శబ్దమదోరకంగా వినబడింది."

ఆలస్యం అమృతం విషం అన్నట్లు కాళ్ళు భార్య వెంట వంటింట్లోకి లాక్కెళ్ళాయి. భారతి నడుం చుట్టూ ఏదో పాకినట్టైంది. వెనక్కు తిరిగింది గబుక్కున. జగన్నాథం చేతులవి.

"అయ్యో రామా! ఇదేమిటండీ ?" గుసగుస.

"అమ్మదొంగా!"

"అది కాదండీ ... మన వంటింటికి తలుపుల్లేవు. అటు వేణు, ఇటు శాంతీ ..." తప్పుకోబోయింది.

"అవన్నీ మామూలే కదా!" చేతులు బిగుసుకుంటున్నాయి.

"సిగ్గులేదూ! కుర్ర చేష్టలు మాని కులాసాగా పడుకోండి." విడిపించుకొని వెళ్ళిపోయింది. తినబోతున్న కొబ్బరి ముక్కను కోతి లాక్కెళ్ళినట్టనిపించింది. ఉసూరుమంటూ ఒరిగిపోయాడు మంచమ్మీద.

నిద్రపోవాలిహ! బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు.

"... రేపీపాటికి ఎవరి స్వర్గంలో వాళ్ళుంటాం!" నిన్న రాత్రి పడుకోబోయేముందు కోట్రెనీ రూమ్మేట్ అన్న మాటలు కమ్మగా తోచినై. అప్పుడు తన హృదయ ఫలకమ్మీద భారతి భాసించింది. చిరునవ్వులు చిందిస్తూ ముంగురులు సవరించుకుంది. చేతులు చాచి కళ్ళతో పిలిచింది.

"నన్నిడిచి ఇన్నిరోజులెలా ఉండగలిగారు?" అంటూ గుండెల మీద ఒరిగిపోయింది. గిలిగింతలు పెట్టి మంచమ్మీదకు నెట్టేసింది.

" అమ్మా... అయ్యా... " భర్త మూలుగులు విని కంగారుగా ఆ బయటికొచ్చింది భారతి.

"ఏమైందండీ?"

"కాళ్ళు భారతీ కాళ్ళు, గుడ్డలు పిండేసినట్లు లాగేస్తున్నాయ్!"

"అయ్యో పాపం! కాస్సేపలా పడుకోండి."

మెత్తని చేతులు కాళ్ళు పడుతోంటే ఉబలాటం ఉప్పెనలా పొంగింది. కూచోబెట్టింది కూడా. స్వచ్ఛమైన భారతి ముఖంలో అనుభవం తాలూకు నిండుదనం. నిర్మలత్వం, కుంకుమ బొట్టు కొత్త అందాన్నిస్తూంది.

"పడుకోండి!" కళ్ళతో ఆదేశించింది.

"నిద్ర రానంటుందోయ్!"చేతులు లేపబోయాడు.

"బాగానే ఉంది సంబడం!" గబుక్కున గదిలోకెళ్ళిపోయింది.

స్వర్గం మెట్లెక్కుతూ సగంలో పడిపోయినట్టనిపించింది. నిశ్శబ్దం ... నిండు పున్నమి వెన్నెలను నీరుగార్చుతున్న నిశ్శబ్దం ... జగన్నాథం ఎదలో రొద. ఛీ ... పడుకోవాలిహ ... లేకపోతే రేపు ఆఫీస్ టేబిల్ ముందు తలవాల్చాల్సి వస్తుంది. ఎడమ అరచేతితో రెండు కళ్ళు మూసుకున్నాడు.

... భారతి ... నా భారతి కళ్ళలో వేయి పున్నమల వెలుగుంది. ఆనందంగా అడుగులు వేస్తూ ముందుకొచ్చింది. చేతిలో చెయ్యేసి విశాల మైదానంలోకి లాక్కెల్లింది. ఆహా ! ప్రకృతికాంత నేల మీద ఆకుపచ్చని పరుపులు పరిచింది. జంటగా దొర్లుతుంటూ ఒంటికి మెత్తగా తాకుతోంది. ఎవడో రాక్షసుడొచ్చి భారతిని లాక్కెలుతున్నాడు... అయ్యో భారతి! నా భారతి !! భారతీ ... భారతీ! ఇల్లంతా దద్దరిల్లింది.

"ఏమైంది నాన్నా" పరుగుత్తుకొచ్చాడు వేణు.

"అయ్యో నాన్న పడిపోయాడు" శాంతి అయోమయం, నుదుటి మీద చెయ్యేసి, "జ్వరమేమీ రాలేదు. పీడకలొచ్చిందా నాన్నా ?" అడిగింది.

కల ... కలనే కాని నేల మీద పడిపోవటం నిజం. తెలిసొచ్చేసరికి తల నరికేసినట్టనిపించింది.

"అబ్బా ... లేవండీ!" తలకింద చెయ్యేసి లేపి కూచోబెట్టింది భారతి - నీళ్ళగ్లాసందించింది.

"మీరంతా వెళ్ళి పడుకోండి". బయటపడకుండా చేసిన బృహత్ప్రయత్నం తికమక పెట్టింది.

వేణూ, శాంతి అడుగులో అడుగేసుకుంటూ, తిరిగి చూస్తూ వెళ్ళిపోయారు.

"ఇదేమీ బాగా లేదండీ!" భారతి గొంతులో జాలి, కోపం, నిస్సహాయత.

"నా బొంద"

"ఇహ పడుకోండి. కలలు మాత్రం కనొద్దు సుమా" అంతరంగంలోని పొంగుల్ని గొంతులో అదిమి పెట్టిందని ఆవిడ పెదాలమీది చిరునవ్వే చెబుతుంది. "మీ ప్రతాపమంతా ఇంతేనా?" ప్రశ్నిస్తుంది కళ్ళతో. ఎడమ చేత్తో పెదాలు కప్పుకుని వెళ్ళిపోయింది.

మళ్ళీ నిశ్శబ్దం. అటూ ఇటూ దొర్లడం. అలా ఎంతసేపు గడిచిందో. సాగరిక కౌగిట్లో సేదదీర్చుకోవాలని ఆరాటపడిన చంద్రుని కోరిక పరుగుల్లోనే కరిగిపోయింది.

"కౌసల్యా సుప్రజా రామ, పూర్వా సంధ్యా ప్రవర్తతే ...

ఉత్తిష్ఠ నరశార్దూలా, కర్తవ్యం దైవమాహ్నికం ..."

శ్రీ వేంకటేశ్వర దేవాలయం సుప్రభాతం వినిపిస్తూంది.

("సరికొత్త కథ" నుండి)